ప్రజాశక్తి
ఆదివారం 3 నవంబర్ 2024 | 5 | శ్రీ సత్యసాయి

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత

మూడొంతుల చెరువులు ఖాళీనే..!

వానలొచ్చినా చెరువుల్లోకి చేరని నీరు
కాలువల నిర్వహణ లోపమే కారణం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది వర్షాలు బాగా పడ్డాయి. సాధారణం కంటే అధికంగానే రెండు చోట్ల వానలు పడ్డాయి. అయితే ఇప్పటికీ చెరువులు మాత్రం మూడొంతులు ఖాళీగానే ఉన్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1484 చెరువులున్నాయి. ఇందులో అనంతపురం జిల్లా పరిధిలో 304 చెరువులుండగా, సత్యసాయి జిల్లా పరిధిలో 1180 చెరువులున్నాయి. వీటిల్లో 48 చెరువులు మాత్రమే పూర్తి సామర్థ్యంతో నిండాయి. ఇందులో అనంతపురం జిల్లాలో 36 చెరువులు, సత్యసాయి జిల్లాలో 12 చెరువులు పూర్తి సామర్థ్యంతో నిండాయి. అంటే రెండు జిల్లాల పరిధిలోనూ కలిపి 48 చెరువులే పూర్తి సామర్థ్యంతో నిండాయి. తక్కిన వాటిల్లో అరకొరగా నీరు ఉన్నాయి. ఇంకా 968 చెరువుల్లో చుక్క నీరు లేదు. అంటే 65 శాతం చెరువులు ఖాళీగా ఉన్నాయి. అనంతపురం జిల్లాలో 171 చెరువులు ఖాళీగా ఉండగా, సత్యసాయి జిల్లాలో 798 చెరువులు ఖాళీగానున్నాయి.

వానలొచ్చినా...వరదలొచ్చినా నిండని చెరువులు

ఈ ఏడాది అత్యధికంగా వర్షపాతం ఉమ్మడి జిల్లాలో నమోదయింది. సాధారణం కంటే అధికంగా వర్షాలు పడ్డాయి. అయినా చెరువులకు నీరు మాత్రం రాలేదు.అదే విధంగా ప్రధాన ప్రాజెక్టులైన తుంగభద్ర డ్యామ్, శ్రీశైలం డ్యామ్‌కు అధిక వరద వచ్చింది. దీంతో అటు తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ, ఇటు హంద్రీనీవా ద్వారా కూడా అధికంగా నీరు తీసుకునే అవకాశం కలిగింది. కాని ఈ కాలువ నిర్వహణ సరిగా లేని కారణంగా వరదలొచ్చినా నీటిని అదనంగా తీసుకోలేకపోవడంతో చెరువులను నింపుకోలేని పరిస్థితి నెలకొంది. ఈ ఏడాది చూస్తే అనంతపుం జిల్లాలో ఇప్పటి వరకు సాధారణ వర్షపాతం 414.5 మిల్లిమీటర్లు కురవాల్సి ఉండగా 565.5 మిల్లమీటర్లు నమోదయింది. సాధారణం కంటే 36.4 శాతం అదనంగా పడింది. సత్యసాయి జిల్లాలో సాధారణ వర్షపాతం 462 మిల్లిమీటర్లకుగానూ 710.8 మిల్లిమీటర్లు పడింది. సాధారణం కంటే ఇక్కడ 53.8 శాతం అధికంగా పడింది. ఈ జిల్లాలోనే అత్యధికంగా చెరువులు కూడా ఉన్నాయి. కాని చెరువులు మాత్రం అత్యధికం ఖాళీగానే ఉండటం గమనార్హం.

నిర్వహణ లోపాలతో నష్టం

చిన్న నీటిపారుదలపై ప్రభుత్వాలు ఏ మాత్రం దృష్టి సారించకపోవడంతో చెరువుల కనీస నిర్వహణకు నోచుకోవడం లేదు. ఎపిఐఎల్‌ఐపి ఎపిఐఐఎటిపి, నాబార్డు తదితర పథకాల కింద కొన్ని పనులు మంజూరైన బిల్లులు రావన్న ఉద్ధేశ్యంతో పనులు నిలిపివేసియున్నారు. సుమారు 51 పనులు చేపడితే అందులో మూడు మాత్రమే ప్రగతిలో ఉన్నాయి. పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు మధ్యలోనే ఆపేశారు. ఇక ఇతర చెరువులకు మరమ్మతులు చేపట్టే పరిస్థితి లేక నీరొచ్చినా ఒడిసి పట్టుకుని నిలుపుకోలేక వృధాగాపోతున్నాయి. దీంతో చెరువుల్లో నీరు నింపుకునే అవకాశమున్నా నిర్వహణ లోపాలతో వృధాగా పోతున్నాయి.

బీసీల అభ్యున్నతే చంద్రబాబు ధ్యేయం

రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

ప్రజాశక్తి-పెనుకొండ

బీసీ బిడ్డల అభ్యున్నతే చంద్రబాబు ధ్యేయమని అధికారం చేపట్టగానే బీసీ హాస్టళ్ల మరమ్మతులకు రూ.20 కోట్లు మంజూరు చేశారని రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖ మంత్రి సవిత అన్నారు. పట్టణంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ బీసీ కళాశాల హాస్టల్ శాశ్వత భవనాన్ని మంత్రి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు బీసీ బిడ్డల చదువు కోసం మరింత ప్రాధాన్యత నిస్తున్నారన్నారు. పెనుకొండ మండల కేంద్రంలో బీసీ హాస్టల్‌ను ప్రైవేటు భవనం కొనసాగిస్తున్నారని హాస్టల్ విద్యార్థుల కష్టాలను సంబంధిత శాఖ అధికారులు తన దృష్టికి తీసుకొచ్చారని అన్నారు. తక్షణమే శాశ్వత వసతి కోసం కొన్ని భవనాలను పరిశీలించామని గతంలో ఐటీఐ కోసం మాజీ మంత్రిపరిటాల రవి నిర్మించిన భవనం తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఆ భవనాన్ని పరిశీలించి చిన్న చిన్న మరమ్మతులు చేపట్టి విద్యార్థులకు శాశ్వత వసతి కలిగించేలా చర్యలు తీసుకున్నామన్నారు. నాణ్యమైన విద్యతో పాటు భోజనం కూడా అందిస్తున్నామని, విద్యార్థులంతా మెరుగైన ఫలితాలు తీసుకురాలని మంత్రి ఆశించారు.

రొద్దం-1 ఎంజేపీ స్కూల్ కు రూ.22.50 కోట్లు మంజూరు

పెనుకొండ నియోజక వర్గంలోని రొద్దం-1 ఎంజేపీ స్కూళ్ల కోసం రూ.22.50 కోట్ల ను మంజూరు చేశామని మంత్రి సవిత తెలిపారు. త్వరలో సోమందేపల్లి బాలిక రెసిడెన్షియల్ స్కూల్‌ను ప్రారంభించనున్నామని మంత్రి వెల్లడించారు. పెనుకొండలో ఉన్న బీసీ బాలిక వసతి గృహానికి త్వరలో మరమ్మతులు చేయనున్నట్లు మంత్రి తెలిపారు..

రూ.6 కోట్లతో టీటీడీ కల్యాణమండపం నిర్మాణం

పెనుకొండలో రూ.6 కోట్లతో టీటీడీ కల్యాణమండపం నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి సవిత వెల్లడించారు. త్వరలోనే కల్యాణ మండపం నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు మంత్రి సవిత వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆనంద కుమార్, టీడీపీ నాయకులు, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారిని నిర్మల జ్యోతి, ఏ బి సి డబ్ల్యూ గంగాధర్, తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ సిద్దయ్య పట్టణ పార్టీ కన్వీనర్ శ్రీరాములు యాదవ్ మాజీ జెడ్పిటిసిలు నారాయణస్వామి మునిమడుగు వెంకట రాముడు, శ్రీనివాసులు, రఘువీరా చౌదరి, రామలింగ, మాజీ సర్పంచ్ అశ్వర్థ నారాయణ,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

'పురం' సుందరీకరణకు ప్రత్యేక చర్యలు

మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణ సుందరీకరణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ మేరకు కమిషనర్ శనివారం పట్టణంలో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించి కార్మికులకు పలు సూచనలు చేశారు. పట్టణంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించామని, దీని కోసం రాత్రిపూట కొంత మంది పారిశుధ్య కార్మికులను నియమించి పనులు చేపడుతున్నామని చెప్పారు. పట్టణ జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్య తక్కువగా ఉన్నప్పటికీ పని విభజన చేసి ప్రధాన రహదారులను రాత్రి సమయంలో శుభ్రం చేయిస్తున్నామన్నారు. చెత్త లేని పట్టణంగా తీర్చిదిద్దాలని కొన్ని వార్డులను ఫైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. దీని కోసం వార్డు సచివాలయ శానిటేషన్ సెక్రేటరీలతో పాటు మెప్మా మహిళలను సైతం బాగస్వాములను చేశామన్నారు. ఇది మంచి ఫలితాలను ఇస్తే, అన్ని వార్డుల్లోను ఇదే తరహా చేపడతామన్నారు.

4న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి రాక

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ఈనెల 4 న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ,రాష్ట్ర రెవెన్యూ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సత్యసాయి జిల్లాకు రానున్నారని కలెక్టర్ టిఎస్ చేతన్ తెలిపారు. శనివారం స్థానిక కలెక్టరేట్లోని మీకోసం సమావేశ మందిరంలో ఈనెల నాలుగో తేదీన జిల్లా అభివృద్ధి పై జరిగే సమావేశంముందస్తు ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భగా కలెక్టర్ మాట్లాడుతూ 4వ తేదీన జరిగే జిల్లా అభివృద్ధి సమావేశంలో ఇన్‌చార్జి మంత్రి పాల్గొంటారని ఆయన చెప్పారు. నూతన ప్రభుత్వం ఏర్పడిన సందర్భంగా గత ఐదు నెలల్లో జిల్లాలో వివిధ శాఖలకు సంబంధించిన ఆయా శాఖలకు సంబంధించిన సాధించిన ప్రగతికి సంబంధించిన నివేదికలు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ విజయ సారథి, పుట్టపర్తి ఆర్‌డిఓ సువర్ణ, సిపిఓ విజయ్ కుమార్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

'ప్రయివేటు' దోపిడీ

నిర్ణీత సమయంలో కాకుండా ఆలస్యంగా బయలుదేరిన ప్రయివేటుబస్సు

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి ప్రాంతంలో ప్రయివేటు బస్సుల యజమానులు అడ్డగోలుగా దోపిడీకి పాల్పడుతున్నారన్న ఆరోపణలు వినపడుతున్నాయి. కర్నాటక రాష్ట్ర ప్రైవేట్ బస్సుల యజమానులు రాష్ట్ర సరిహద్దు దాటి వారికి కేటాయించిన పర్మిట్ పరిధి దాటి రవాణా సాగిస్తున్నట్లు తెలుస్తోంది. రవాణా శాఖ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే వారికి కేటాయించిన పర్మిట్ రద్దయ్యే అవకాశాలు ఉన్నాయి. అదేవిధంగా ప్రయాణికుల సౌకర్యార్థం వారికి కేటాయించిన పర్మిట్ పరిధి నుండి ప్రయాణికులను సకాలంలో గమ్యస్థానానికి చేరవేసేందుకు స్టేజ్ క్యారేజ్ పర్మిట్, గతంలో రూట్ పర్మిట్ మంజూరు చేశారు. అయితే వారికి కేటాయించిన సమయాల్లో వెళ్లకుండా, ఒక్క బస్సు స్థానంలో మరొక్కటి నడుపుతూ నిబంధనలకు తిలోదకాలు ఇస్తున్నట్లు విమర్శలున్నాయి. అంతేకాకుండా ఇచ్చిన పర్మిట్ పరిధి దాటి పెళ్లిళ్లు ఇతర శుభకార్యాల కోసం అద్దెకు మాట్లాడుకొని రాష్ట్ర ప్రభుత్వం ఆదాయానికి, ఆర్టీసీ ఆదాయానికి గండికొట్టి బస్సులు తిప్పుకుంటున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. దీపావళి పండుగ సందర్భంగా బుధవారం ఎస్ఎల్ఎన్ పేరుమీద బెంగళూర్ కదిరి మధ్య తిరిగే బస్సు నెంబర్ కెఎ 40 8696 సాయంత్రం 5గంటలకు కదిరికి రావాల్సి ఉండగా ఆ నెంబర్ బస్సు బెంగళూర్ నుండి కదిరి కి 70 మంది ప్రయాణికులతో రు 300 చొప్పున మాట్లాడుకొని అర్ధరాత్రి సమయంలో కదిరికి వచ్చినట్లు సమాచారం. ఈ నెంబర్ బస్సు స్థానంలో కెఎ 40 ఎ 1674 నెంబర్ బస్సు ఆ సమయంలో కదిరికి వచ్చింది. ఈ నెంబర్ బస్సు బి కొత్తకోట నుండి గౌరీబిదనూర్ రూట్ లో నడుస్తున్నట్లు తెలుస్తోంది. కర్ణాటక నుండి కదిరికి నడిపిస్తున్న బస్సుల యాజమాన్యాలు తమను ఎవరూ ఏమీ చేస్తారన్న భావనతో అదనపు సమయంలో తిరుగుతున్నట్లు తెలుస్తోంది. అలాగే కదిరి పరిసర ప్రాంతాలలో పెళ్ళిళ్ళు శుభకార్యాలకు అద్దెకు మాట్లాడుకొని యదేచ్చగా అడ్డగోలుగా రవాణా కొనసాగిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. కర్నాటక రాష్ట్రంలో పర్మిట్ కలిగిన బస్సులు పదుల సంఖ్యలో రాష్ట్ర సరిహద్దు దాటి సరిహద్దు మండలాలకు బాడుగ మాట్లాడుకొని రాష్ట్ర ఆదాయానికి గండికొడుతున్నట్లు సమాచారం. రాష్ట్రంలో తిప్పుకోవాలంటే కాంట్రాక్ట్ క్యారేజ్ పర్మిట్ పన్ను చెల్లించి సంబంధిత శాఖ ద్వారా టెంపరరీ పర్మిట్ పొందాలి. కానీ వీటన్నిటికి తిలోదకాలిస్తూ రవాణా శాఖ నుండి ఎలాంటి అనుమతులు పొందకుండా ఇటీవల కాలంలో రవాణా అధికారుల కళ్లు కప్పి కదిరి పట్టణంతో పాటు చుట్టూ పక్కల మండలాలోకి పెళ్ళిళ్లు,ఇతర శుభకార్యాలకు అద్దెకు మాట్లాడుకొని బస్సులు తిప్పుతూ రాష్ట్ర ప్రభుత్వానికి పన్నులు చెల్లించకుండా అడ్డగోలుగా రవాణా కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. అలా అడ్డగోలుగా బస్సులను తిప్పుతున్న సమయంలో రహదారిలో ఏదైనా ప్రమాదం సంభవిస్తే పర్మిట్ పరిధి దాటి మరో ప్రాంతానికి వచ్చినందున లోకేషన్ ద్వారా సంబంధిత వాహనానికి ఇన్స్యూరెన్స్ కూడా వర్తించదు. దీంతో ప్రమాద బాధితులు భారీగా నష్టం కలిగే అవకాశం ఉంటుంది. అడ్డగోలుగా తిరిగే ఈ బస్సులపై రవాణా అధికారులు దృష్టి సారించి అడ్డగోలు రవాణా కి చెక్ పెట్టే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

రాష్ట్రంలో కేటాయించిన పర్మిట్ పరిధిలో వారికి కేటాయించిన రూట్ సమయాల్లో మాత్రమే బస్సులు తిప్పాలి. అలా కాకుండా పర్మిట్ నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనాల పై నిఘా ఉంచి చర్యలు తీసుకుంటాం.

వరప్రసాద్,
మోటార్ వాహనాల అధికారి, కదిరి

'ఆధార్'లో తప్పులు.. 'అపార్' కష్టాలు...

విద్యార్థుల వ్యక్తిగత సమాచారంలో వ్యత్యాసాలు
70 శాతం వివరాల్లో తేడాలు

ప్రజాశక్తి-హిందూపురం

నూతన జాతీయ విద్యా విధానంలో భాగంగా ప్రతి విద్యార్థికి జీవితకాల గుర్తింపు సంఖ్యతో కార్డు జారీ చేయాలని మూడేళ్ల కిందటే కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. ఇందులో భాగంగా ఆటో మేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) పేరుతో 12 అంకెల సంఖ్యతో కార్డు జారీ చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. విద్యార్థుల అకడమిక్ పురోగతిని అంచనా వేయడానికి ఇది ఉప యోగపడుతుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఒకటి నుంచి 10వ తరగతి వరకు చదువు తున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వీటిని జారీ చేయాలని నిర్ణయించారు. రెండు జిల్లాల పరిధిలో సుమారు 4,21,374 మంది విద్యార్థులకు పంపిణీ చేయాల్సి ఉంది. అపార్ కార్డుల జారీకి కష్టాలు తప్పడం లేదు. కార్డుల జారీ బాధ్యతను ప్రధానోపాధ్యాయులకు అప్పగించారు. లక్ష్యం మేరకు కార్డులు జారీ చేయక పోతే తాఖీదులు ఇస్తామని విద్యాశాఖ ఉన్నతాధికారులు ఇప్పటికే హుకుం జారీ చేశారు. చాలా మంది విద్యార్థుల వివరాలు పాఠశాల దస్త్రాల్లో ఒక రకంగా.. ఆధార్ కార్డుల్లో మరో రకంగా ఉన్నాయి. ఇందులో ప్రవేటు పాఠశాలల్లో ఆధార్ మేరకే 50 నుంచి 60 శాతం వరకు సరిపోతున్నాయి. అయితే చాలా ప్రభుత్వ పాఠశాలల్లో 30 శాతం వివరాలే దస్త్రాలు, ఆధార్ కార్డులతో సరిపోతున్నాయి. ఆధార్ నమోదులోనే ఎక్కువగా తప్పులుంటున్నాయి. ఒకసారి అపార్ కార్డు ఇస్తే విద్యార్థి చదువు పూర్తయ్యే వరకు ఇదే నంబరు ఉంటుంది.

తప్పులు సవరించుకుంటేనే

8 ఏళ్ల కిందట ఆధార్ తీసుకున్న వారి వివరాల్లో పెద్ద ఎత్తున తప్పులు ఉన్నాయి. ప్రస్తుతం అపార్ కార్డును ప్రాధాన్యతాంశంగా



పరిగణించాలని చెబుతున్నారు. దీంతో ఆధార్‌లోని తప్పులను సరిచేసుకోవాల్సి ఉంది. ఇందుకోసం ఆధార్ కేంద్రాలకు వెళ్లాలి. దీంతో గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని గ్రామాల్లో ఆధార్ కేంద్రాలు లేవు. దీంతో తల్లిదండ్రులు విద్యార్థులను పక్క గ్రామాలకు తీసుకెళ్లి ఆధార్‌లో తప్పులను సవరించుకోవాల్సి వస్తోంది. వ్యవసాయ పనుల కారణంగా చాలామంది ఇందుకోసం సమయం వెచ్చించ లేకపోతున్నారు. దీంతో పాటు ఆధార్ సవరించడానికి రూ.50 నుంచి 100 రూపాయల వరకు చెల్లించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణానికి రావాడానికి అదనపు ఖర్చు అవుతోంది. పెరిగిన ధరలతో సతమతమౌతున్న పేదలపై ఇది అదనపు భారంగా మారింది.

ఇలా చేస్తే ప్రయోజనం ఉంటుంది

పుట్టిన తేదీ, తల్లిదండ్రుల పేర్లను అడ్మిషన్ రిజిస్టర్ ప్రకారం ప్రధానోపాధ్యాయులు యూడైస్ లో మార్చవచ్చు. స్కూల్ లో అడ్మిషన్ రిజిస్టర్ ప్రకారం ప్రధానోపాధ్యాయులు సర్టిఫికెట్ ఇస్తే ఈ వివరాల ప్రకారం ఆధార్ కేంద్రాల్లో మార్చేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి. ఆధార్ వివరాల సవరణ బాధ్యత ప్రధానోపాధ్యాయులకు అప్పగిస్తే ప్రయోజనం ఉంటుంది. వీటితో పాటు సచివాలయల ఎడ్యుకేషన్ సెక్రేటరీలకు యూజర్ ఐడిలను ప్రభుత్వం ఇచ్చి, ప్రతి సచివాయాలనికి ఒక ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయడంతో పాటు పాఠశాల, కళాశాలల్లో ప్రత్యేక క్యాంపులను ఏర్పాటు చేసి ఆధార్ సవరణ కార్యక్రమం చేపడితే ప్రభుత్వ లక్ష్యం నెరవేరా అవకాశాలు ఉన్నాయి.

గుంతలు లేని రహదారులే లక్ష్యం

మంత్రులు సత్యకుమార్, సవిత

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

వచ్చే జనవరి నాటికి రాష్ట్రంలో ఎక్కడా గుంతలు కనిపించకుండా చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోందని, అధికారులు చిత్తశుద్ధితో ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ కోరారు. పట్టణంలో శనివారం మంత్రి జనసేన రాష్ట్ర నాయకులు చిలకం మధుసూదన్‌రెడ్డి తో కలిసి స్థానిక బత్తలపల్లి రోడ్డులో సిఎన్‌బి ఫంక్షన్ హాల్ వద్ద పూజలు చేసి గుంతలను పూడ్చే కార్యక్రమాన్ని ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రధాన రహదారులపై రూ. 2.9 కోట్ల వ్యయంతో పనులు ప్రారంభించామన్నారు. రోడ్ల మరమ్మతులకు ప్రజల సహకారం అవసరమన్నారు. భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు. వైసిపి పాలనలో రాష్ట్రంలో రోడ్లు ప్రజలకు నరకం చూపించాయని ఈ పరిస్థితిని మార్చడానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బి అధికారులు, బిజెపి అనంతపురం జిల్లా అధ్యక్షులు సంధిరెడ్డి శ్రీనివాస్, డోలా రాజారెడ్డి, సాకే ఓబులేసు, ప్రకాష్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతను పూడ్చుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

పెనుకొండ : ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని బిసి సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి సవిత తెలిపారు. గత ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వ నిర్లక్ష్యంతో గుంతలుగా మారిన రోడ్లను బాగు చేసే కార్యక్రమంలో భాగంగా శనివారం నగర పంచాయతీ పరిధిలోని తిమ్మాపురం వద్ద రోడ్ల గుంతలు పూడ్చే పనులను అధికారులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో రోడ్ల మరమ్మతులకు రూ. 85 లక్షలు కేటాయించారని తెలిపారు. గత ప్రభుత్వంలో రోడ్లను పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో ఎక్కడ చూసినా గుంతలు దర్శనం ఇస్తున్నా యని మండిపడ్డారు. రోడ్ల గుంతలు పూడ్చేందుకు తట్టెడు మట్టి కూడా పోసిన పాపానపోలేదని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో ఆర్డీవో ఆనంద్‌కుమార్, ఆర్‌అండ్‌బి డిఈ, ఏఈ, అధికారులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

సరిహద్దుల్లో నేరాల నియంత్రణకు చర్యలు : ఎస్పీ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

జిల్లా సరిహద్దులో ఉన్న పోలీస్‌స్టేషన్ల పరిధిలో నేరాలను పూర్తిగా నియంత్రించేందుకు అన్ని చర్యలు చేపట్టాలని ఎస్పీ వి.రత్న ఆదేశించారు. సరిహద్దు పోలీస్ స్టేషన్ల పరిధిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎస్పీ శనివారం తన ఛాంబర్‌లో ఆయా స్టేషన్ల సిఐలు, ఎస్ఎస్ఐలతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా నేర సమీక్ష నిర్వహించారు. ఎలాంటి నేరాలు నమోదవుతున్నాయి, సిబ్బంది పనితీరు, స్టేషన్లకు కావాల్సిన సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఎస్పీ మాట్లాడుతూ క్రైమ్ రేట్ నియంత్రణకు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. సరిహద్దులో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు, అక్రమ రవాణా జరగకుండా గట్టి నిఘా పెట్టాలన్నారు. ప్రధానంగా జూదం, గంజాయి, మద్యం అక్రమ రవాణా కట్టడికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఫ్యాక్షన్ గ్రామాల్లో ఎప్పటికప్పుడు పరిస్థితులను తెలుసుకోవాలన్నారు. మహిళా పోలీసులు తరచూ గ్రామాలను సందర్శించి ప్రజలకు అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. జూమ్ కాన్ఫరెన్స్‌లో ఎస్‌బి సిఐ బాలసుబ్రమణ్యంరెడ్డి, డిసిఆర్‌బి సిఐ శ్రీనివాసులు, సోషల్ మీడియా సిఐ తిమ్మారెడ్డి, ఆర్ఐ వలి పాల్గొన్నారు.

అన్నదానానికి చేయూత

ప్రజాశక్తి-హిందూపురం

సద్గురు యోగి నారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత అన్నదానానికి దాతలు చేయూతను అందించారు. పేదల ఆకలి తీర్చేందుకు సేవాసమితి చేస్తున్న సేవలను గుర్తించిన స్థానిక వైష్ణవి ఇఎన్‌టి ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో వంట తయారు చేయడానికి రెండు కుక్కర్లు, స్టవ్‌తో పాటు రూ.25 వేలు విలువ చేసే వంట వస్తువులను అందజేశారు. అదే విధంగా కోలార్ పూల మార్కెట్ కు చెందిన వ్యాపారి వరదప్ప నాలుగు బియ్యం బస్తాలను వితరణంగా అందజేసినట్లు సేవా సమితి అధ్యక్షులు రవిశంకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మహేష్ కుమార్, నాగరాజు, గొల్లన్న, సూర్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

గుంతలు లేని రహదారులే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

ప్రజాశక్తి-తనకల్లు

రాష్ట్రంలో గుంతలు లేని రహదారులు నిర్మించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. గుంతలు రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా శనివారం ఎమ్మెల్యే రూ. 1.12 కోట్ల వ్యయంతో మండలంలోని కొక్కంటి క్రాస్ నుంచి మహమ్మదాబాద్ క్రాస్ వరకూ, చీకటిమానిపల్లి నుంచి బొంతలపల్లి వరకూ చేపట్టిన రోడు పనులను ప్రారంభించారు. ఎమ్మె ల్యే మాట్లాడుతూ వైసిపి హయాంలో జగన్ ధనార్జనే ధ్యేయంగా పరిపాలన కొనసాగించారన్నారు. మద్యం, ఇసుక, మైనింగ్ రూపంలో రాష్ట్రాన్ని దోచేశారన్నారు. అలాంటి పరిస్థితుల నుంచి సిఎం చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్తున్నారన్నారు. ఇచ్చిన హామీలన్నీ తూచా తప్పకుండా అమలు చేస్తామని తెలిపారు. రాబోయే ఏడాదిన్నర కాలంలో నిరుద్యోగ యువతకు ఇక్కడే ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు కొల్లకుంట అంజనప్ప, మండల కన్వీనర్ రెడ్డి శేఖర్‌రెడ్డి, నాయకులు శంకర్‌నాయుడు, సోంపాలెం నాగభూషణ, కొట్టికుమార్, కావడి ప్రవీణ్‌కుమార్, ఆర్అండ్‌బి అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిటిడి ఛైర్మన్‌ను కలిసిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మడకశిర

తితిదే ఛైర్మన్ బిఆర్ నాయుడుకు జ్ఞాపిక ఇస్తున్న ఎమ్మెల్యే రాజు

తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మన్ బిఆర్. నాయుడును శనివారం ఎమ్మెల్యే, తితిదే పాలక మండలి సభ్యులు ఎంఎస్.రాజు హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. రాజు మాట్లాడుతూ గత ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం తితిదే వ్యవస్థను భ్రష్టు పట్టించారన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఒక ఉన్నతమైన వ్యక్తి బిఆర్ నాయుడును తితిదే ఛైర్మన్‌గా నియమించడం గౌరవప్రదంగా ఉందన్నారు. జగన్ ప్రభుత్వంలో తితిదేలో జరిగిన తప్పిదాలను సరి చేసి భక్తుల మనోభావాలు దెబ్బ తినకుండా తిరుమల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

జనవరి నాటికి గుంతల రహిత రహదారులు

మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి

ప్రజాశక్తి-మడకశిర

విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి

గుంతలు రహిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి తెలిపారు. పట్టణంలోని వైబి హళ్లి రోడ్డులో శనివారం చేపట్టిన గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రాష్ట్రంలో రోడ్లన్నీ గుంతలమయమై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. దీంతో సిఎం చంద్రబాబు నిధులు మంజూరు చేసి జనవరి లోపు రాష్ట్రవ్యాప్తంగా గుంతలు లేని రహదారులుగా తీర్చిదిద్దాలని సంకల్పించారన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ దాసిరెడ్డి, నాయకులు మల్లికార్జున, కౌన్సిలర్లు ఉమాశంకర్, బలరాం, రమేష్, వెంకటలక్ష్మమ్మ, నాగరాజు, నరేష్, కన్నా, రఘురాం, నాగరాజు, కృష్ణమూర్తి, తిమ్మరాజు, బాబు, గంగాధర్ పాల్గొన్నారు.

'అమరాన్' చిత్రంలో పెనుకొండ వాసి

ప్రజాశక్తి -పెనుకొండ టౌన్

సినీనటి సాయిపల్లవితో సుగమ్యశంకర్

అశోకచక్ర గ్రహీత మేజర్ ముకుంద వరదరాజన్ జీవితగాథ ఆధారంగా తీసిన అమరాన్ చిత్రం ఇటీవల విడుదలైంది. ఇందులో సాయిపల్లవి, శివకార్తికేయన్ ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ చిత్రంలో పెనుకొండ పట్టణానికి చెందిన ప్రముఖ భరతనాట్య కళాకారిణి ప్రవీణకుమారి సుగమ్య శంకర్ నటించారు. సుగయ్యశంకర్ నిత్యవరదరాజన్ పాత్రలో కథానాయిక సోదరి పాత్ర పోషించడం సంతోషంగా ఉందని సుగమ్య తల్లిదండ్రులు గాయత్రి, రవిశంకర్ తెలిపారు. సుగమ్య మాట్లాడుతూ ఒక గొప్ప దేశ రక్షకుడి జీవితం ఆధారంగా తెరకెక్కించిన చిత్రంలో నటించడం అనిర్వచనీయమైన అనుభూతి కలిగించిందన్నారు. తనను తమిళ సినీ పరిశ్రమతో పాటు తెలుగు ప్రేక్షకులు, తెలుగు సినిమా పరిశ్రమ ప్రోత్సహిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అందరూ కుటుంబ సమేతంగా చూడదగిన చిత్రం అన్నారు.

సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే సింధూర, పల్లె రఘునాథరెడ్డి, టిడిపి నాయకులు

ప్రతి బుధవారం ఓ మండలంలో 'ప్రజా గ్రీవెన్స్'

ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీమంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

ప్రజల సమస్యల పరిష్కారం కోసం నియోజక వర్గం లో ప్రతి బుధవారం ఒక మండ లంలో ప్రజా గ్రీవెన్స్ నిర్వహిస్తా మని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తెలిపారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం టిడిపి సభ్యత్వ నమోదుపై సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ టిడిపి సభ్యత్వం ఉన్న కార్యకర్తలకే పార్టీలో పదవులు దక్కుతాయని తెలిపారు. అలాగే సభ్యత్వం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రతి కార్యకర్త సభ్యత్వ నమోదు చేసుకో వాలని సూచించారు. సభ్యత్వ నమోదులో నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో నిలపాలని కోరారు. 60 వేల సభ్యత్వాలు తగ్గకుండా చేయడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. కార్యకర్తలకు అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. సమావేశంలో మండల కన్వీనర్లు, మున్సిపల్ మాజీ ఛైర్మన్లు, బూత్ కన్వీనర్లు, యూనిట్ ఇన్‌ఛార్జులు, పుర ప్రముఖులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విజయవాడలో వక్ఫ్ పరిరక్షణ మహాసభ

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ఈ నెల 3వ తేదీ విజయవాడలో నిర్వహించే వక్ఫ్ పరిరక్షణ మహాసభను విజయవంతం చేయాలని ముస్లిం మైనార్టీ డెవలప్‌మెంట్ అసోసియేషను (ఎంఎండిఎ) జిల్లా అధ్యక్షుడు సయ్యద్ రోషన్ జమీర్ పిలుపునిచ్చారు. పట్టణంలోని నియోజకవర్గ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 3వ తేదీ విజయవాడలోని కుమ్మరిపాలెం ఈద్గా మైదానంలో నిర్వహించే 'వక్ఫ్ పరిరక్షణ మహాసభకు' జిల్లా వ్యాప్తంగా మసీదు మతపెద్దలు, ఎంఎండిఎ నాయకులు, ముస్లిం ప్రజలు పెద్ద ఎత్తున తరలి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎండిఎ నాయకులు ఖాదర్‌వలి, ముంతాజ్, మస్తాన్‌వలి, రసూల్, తదితరులు పాల్గొన్నారు.

కూటమితోనే రాష్ట్రాభివృద్ధి

ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి

ప్రజాశక్తి-కొత్తచెరువు

రోడ్డు మరమ్మతులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

సిఎం చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి తెలిపారు. గుంతలు రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని తలమర్ల రోడ్డులో తిప్పాభట్లపల్లి వద్ద రూ. 25 లక్షల వ్యయంతో చేపట్టిన రోడ్డు పనులను ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్ టిఎస్.చేతన్, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో రోడ్లకు కనీసం మట్టి కూడా వేయలేకపోయారని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నియోజకవర్గంలో రూ. 1.48 కోట్ల వ్యయంతో రోడ్ల మరమ్మతులు చేపట్టినట్లు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రూ. 6 కోట్లతో రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. గుంతలు లేని ఆంధ్రప్రదేశగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. పల్లె రఘునాథ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. కొత్తచెరువు నుంచి తలమర్ల మీదుగా గుట్టూరు, కియా వెళ్లే రహదారిని రెండు లేన్ల రహదారిగా మంజూరు చేయాలని ప్రజలు ఎమ్మెల్యే, కలెక్టర్‌ను కోరగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. కొత్తచెరువు నుంచి పెనుగొండ వెళ్లే ప్రధాన రహదారిలో రైల్వే అండర్ బ్రిడ్జి కింద వర్షం నీరు నిలుస్తున్నాయని తెలుపగా దీనిపై రైల్వే అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్డీవో సువర్ణ, తహశీల్దార్ నీలకంఠారెడ్డి, ఆర్అండ్‌బి ఏఈ వన్నూరుస్వామి, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఎస్.శ్రీనివాసులు, మండల కన్వీనర్ రామకృష్ణ, టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, నాయకులు గంగన్న, ఆదిశేషప్పనాయుడు, రాజు, షర్ఫుద్దీన్, పెద్దన్న, వెంకటేష్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సీనియర్ హాకీ పోటీలకు ధర్మవరం క్రీడాకారులు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

కోచ్ హుస్సేన్‌తో హాకీ క్రీడాకారులు

హాకీ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 4 నుంచి 16వ తేదీ వరకూ చెన్నైలో జరిగే 14వ పురుషుల జాతీయ సీనియర్ హాకీ పోటీల్లో పాల్గొనే ఎపి జట్టుకు ధర్మవరం క్రీడాకారులు హరీష్, వెంకటేష్‌నాయక్, రాజేష్ ఎంపికైనట్లు హాకీ ఎపి వైస్ ప్రెసిడెంట్, జిల్లా జనరల్ సెక్రటరీ బందనాథం సూర్యప్రకాష్ తెలిపారు. గత జూన్‌లో ధర్మవరంలో జరిగిన 14వ రాష్ట్ర స్థాయి సీనియర్ పురుషుల టోర్నమెంట్లో జిల్లా హాకీ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. అందులో ప్రతిభ కనబరిచిన ఈ ముగ్గురు క్రీడాకారులు రాష్ట్ర జట్టులో స్థానం సాధించారన్నారు. రాష్ట్ర జట్టుకు ధర్మవరం పట్టణానికి చెందిన ఎస్.హస్సేన్ కోచ్‌గా వ్యవహరిస్తారు. ఎంపికైన క్రీడాకారులకు జిల్లా జనరల్ సెక్రటరీ బంధనాథంతో పాటు జిల్లా గౌరవాధ్యక్షులు బండి వేణుగోపాల్, పల్లెం వేణుగోపాల్, జిల్లా అధ్యక్షులు బివి.శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు ఉడుముల రామచంద్ర, గౌరీప్రసాద్, మహమ్మద్ అస్లాం, ట్రెజరర్ అంజన్న, జాయింట్ సెక్రటరీ అరవింద్‌గౌడ్, చంద్రశేఖర్, డైరెక్టర్లు మారుతి, ఇర్షాద్, సీనియర్ క్రీడాకారులు రాఘవేంద్ర, అమునుద్దీన్, కిరణ్ అభినందనలు తెలిపారు.

రైల్వే అండర్ బ్రిడ్జి కింద సిపిఎం నిరసన

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

రైల్వే బ్రిడ్జి వద్ద నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు

పట్టణంలోని గాంధీనగర్ రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నీరు నిల్వ ఉండడం పట్ల శనివారం సిపిఎం ఆధ్వర్యంలో సిఐటియు నాయకులు, వాహనదారులు నిరసన వ్యక్తం చేశారు. సిఐటియు నాయకులు మాట్లాడుతూ ఈ మార్గం గుండా కొత్తపేట, రామ్‌నగర్, రైల్వేస్టేషన్, తారకరామాపురం, గుట్టకింద పల్లి, అనంతపురం వైపు ప్రజలు రాకపోకలు సాగిస్తూ ఉంటారన్నారు. అయితే రైల్వే అండర్ బ్రిడ్జి కింద నీరు చేరి, దుర్వాసన వెదజల్లుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని మండిపడ్డారు. ఇకనైనా అధికారులు స్పందించి పట్టణం లో రైల్వే అండర్ బ్రిడ్జిల వద్ద నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం వెళ్లి ఆర్‌ఓ రాజేశ్వరికి వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి ఎ.మారుతి, నాయకులు ఎస్‌హెచ్ బాషా, జెవి.రమణ, అయూబ్‌ఖాన్, ఎస్ఎఫ్ఐ నాయకుడు నాగార్జున, హరి, వెంకటస్వామి, లాజర్, వాహనదారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి-కొత్తచెరువు

వైసిపి నాయకులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

మండలంలోని వివిధ గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వ్యక్తుల కుటుంబాలను, అనారోగ్యంతో బాధపడుతున్న వారిని శనివారం మాజీ ఎమ్మెల్యే డి.శ్రీధర్‌రెడ్డి పరామర్శించారు. ఎర్రబెల్లి గ్రామానికి చెందిన హోంగార్డ్ చెన్నప్ప, వైసిపి నాయకుడు డేరంగుల రాజేంద్ర, చెన్నరాశిపల్లి గ్రామానికి చెందిన రామచంద్రారెడ్డి, లోచర్ల గ్రామానికి చెందిన ఈశ్వర్‌రెడ్డి ఇటీవల మృతి చెందారు. దీంతో ఆయన వారి వారి ఇళ్లకు వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని వారికి భరోసా కల్పించారు. అలాగే కొత్త చెరువులో బిసి కాలనీకి చెందిన హమాలీ పోతులయ్య, వైసిపి నాయకుడు ఆంజనేయులు ఇటీవల మృతి చెందగా వారి ఇళ్లకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైసిపి నాయకుడు సూరి తండ్రి వెంకట్రాముడు అనారోగ్యంతో ఉండగా వారింటికి వెళ్లి పరామర్శించారు అలాగే జిలాన్, వేణులను పరామర్శించారు. పాతదేవరపల్లి, నాగిరెడ్డిపల్లి గ్రామాల్లో పర్యటించి పలు వైసిపి కుటుంబాలను పరామర్శించారు. ఆయన వెంట నాయకులు రెడ్డప్పరెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, వాల్మీకి శంకర్, దాల్‌మిల్లు సూరి, నాగరాజు, లోచర్ల రాజారెడ్డి, అశోక్‌రెడ్డి, భాస్కర్, సోమశేఖర్‌రెడ్డి, నందిరెడ్డి, కృష్ణమూర్తి, వెంకట్రాముడు ఉన్నారు.

ఖాద్రీశుని ఆలయానికి భక్తుల తాకిడి

ప్రజాశక్తి-కదిరి అర్బన్

భక్తులతో కిక్కిరిసిన ఆలయ ప్రాంగణం

పట్టణంలో వెల సిన ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. కార్తీక మాసంలో మొదటి శనివారం కావడంతో స్వామి దర్శనం కోసం జిల్లా నుంచే కాకుండా కర్నాటక, తదితర సుదూర ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. దీంతో తిరుమాడ వీధులు భక్తజనంతో కిక్కిరిసాయి. పలువురు భక్తులు ముందుగా స్వామి వారికి తలనీలాలు, తులభారం మొక్కుబడి సమర్పించి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. భక్తుల సౌకర్యార్థం అతి శీఘ్ర దర్శనం, ప్రత్యేక దర్శనం, ఉచిత దర్శనం క్యూలైన్లు ఏర్పాటు చేశారు. దర్శనం అనంతరం భక్తులకు నైవేద్య ప్రసాదంతో పాటు నిత్య అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు.

విద్యుత్‌ఛార్జీల పెంపును ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి-ముదిగుబ్బ

విద్యుత్ ఛార్జీల పెంపు నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఐ మండల నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలో శనివారం సిపిఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్డీఎ కూటమి అధికారంలోకి వచ్చిన 5 నెలల్లోపే విద్యుత్ బిల్లులను పెంచి ప్రజలపై ఆర్థిక భారం మోపాలనుకోవడం దారుణమన్నారు. తక్షణమే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, లేనిచో త్వరలోనే ముదిగుబ్బలో ప్రజలతో కలిసి సిపిఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో సిపిఐ రైతు సంఘం మండల అధ్యక్షులు డాబా రామకృష్ణ, నాయకులు రాధాకృష్ణ, చెన్నప్ప, సత్యనారా యణ, కంసల రామచంద్ర, తిప్పయ్య, ఆదెప్ప, తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి కాల్వకు పైప్‌లైన్ పనులు

ప్రజాశక్తి-సోమందేపల్లి

సోమందేపల్లిలో చెరువు కింద పొలాల వెంబడి హంద్రీనీవా కాలువ నీరు వెళ్తున్నా కాలువ కింద పొలాలు మాత్రం బీడు ఉండేవి. గత వారంలో మంత్రి సవిత మండలంలో పర్యటించిన సమయంలో రైతులు తమ కష్టాలను విన్నవించారు. స్పందించిన మంత్రి కాలువకు పైపులైన్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించడంతో శనివారం కాలువ వద్దకు పైపులు చేర్చారు. దీంతో టిడిపి హిందూపురం పార్లమెంట్ కార్యదర్శి నీరుగంటి చంద్ర, టౌన్ కన్వీనర్ వడ్డే సురేష్ ఆధ్వర్యంలో పైపులైన్ పనులను ప్రారంభించారు.

రొద్దంలో టిడిపి సభ్యత్వ నమోదు

రొద్దం : స్థానిక న్యూ ఎస్సీ కాలనీలో శనివారం టిడిపి నాయకులు సభ్యత నమోదు కార్యక్రమం చేపట్టారు. వారు ఇంటింటికీ వెళ్లి సభ్యత్వం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించి పలువురి చేత టిడిపి సభ్యత్వం నమోదు చేయించారు. కార్యక్రమంలో నరేంద్రకుమార్, హనుమంత రాయుడు, టిడిపి నాయకులు రామకృష్ణ, తిరుపతయ్య, మండల డీలర్ల సంఘం అధ్యక్షులు పైగేరి సిద్ధన్న, శ్రీనివాసులు, మేకల నాగన్న, గోవిందరాజులు, నారాయణప్ప, ఉగ్రప్ప, నాగిరెడ్డిపల్లి తిప్పన్న, సుబ్బరాయప్ప, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పంట సాగుకు రైతులు సిద్ధం

ప్రజాశక్తి-బుక్కపట్నం

జిల్లాలోనే అతిపెద్దదైన బుక్కపట్నం చెరువుకు పూర్తిస్థాయిలో నీరు చేరడంతో రైతులు పంట సాగుకు సిద్ధమయ్యారు. ముందుగా చెరువు నుంచి పంట పొలాలకు వెళ్లే ప్రధాన కాలువలు, రైతుల పంట పొలాల సాగుకు వెళ్లే కాలువల్లో కంప చెట్లు, ముళ్లపొదలను శనివారం జెసిబి సాయంతో తొలగించారు. చెరువు ద్వారా 3 వేల ఎకరాల్లో పంటలు సాగు చేయడానికి రైతులు పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. కార్యక్రమంలో రైతులు సంజీవరాయుడు, బాలు, నాగభూషణం, ఆదినారాయణ, కోన కేశప్ప, ఎర్రన్న, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ. 50 వేలు విరాళం

ప్రజాశక్తి-బుక్కపట్నం

బుక్కపట్నంలోని పురాతన రామాలయం జీర్ణోద్ధరణకు ఇదే గ్రామానికి చెందిన మిలిటరీ నాగేశం రూ. 51,116 విరాళాన్ని శనివారం ఆలయ కమిటీ అధ్యక్షుడు రాజశేఖర్‌గౌడ్‌కు అందజేశారు. దాత మాట్లాడుతూ గ్రామంలో పురాతనమైన రామాలయం రోడ్డు విస్తరణలో కోల్పోగా తిరిగి జీర్ణోద్ధరణ పనులు ప్రారంభించడంతో విరాళం ఇచ్చానని తెలిపారు. కమిటీ సభ్యులు దాతను అభినందించారు. ఆల నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు అక్కులప్ప, శ్రీనివాసులు, ఆటో రాము, వెంకటరాముడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

హోటళ్లు, టీ స్టాల్స్ నిర్వాహకులకు హెచ్చరికాలు జారీ చేస్తున్న ఎస్ఐ రమేష్

హోటళ్ల నిర్వాహకులకు సూచనలు

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల పరిధిలో జాతీయ రహదారుల వెంబడి హోటళ్లు, టీస్టాల్స్ నిర్వహించే యజమానులకు ఎస్ఐ రమేష్‌బాబు శనివారం పలు సూచనలు చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ మాట్లాడుతూ ౹ రాత్రి 10:30 గంటల వరకూ మాత్రమే టీ స్టాల్స్, హోటళ్లు నడపాలన్నారు. ప్రతి హోటల్ యజమాని కనీసం 3 సీసీ కెమెరాలను వారం లోపు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. హోటళ్లలో మద్యం తాగడం అనుమతించరాదన్నారు. నిబంధనలను ధిక్కరిస్తే కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తామని స్పష్టం చేశారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి పోరాటాలు

ప్రజాశక్తి-గాండ్లపెంట

గాండ్లపెంట, నంబులపూలకుంట, తలుపుల మండలాలకు సంబంధించి శనివారం సిపిఎం శాఖ మహాసభ నిర్వహించారు. ఈమహాసభకు జిల్లా కార్యదర్శి బడా సుబ్బిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా శాఖ మహాసభ కార్యదర్శిగా కెకె.రాజారెడ్డిని ఎన్నుకున్నట్లు బడ్డా సుబ్బిరెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ నెలలో జరిగే ఉద్యమాల్లో గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, ప్రజల సమస్యలపై పోరాడతామని తెలిపారు. కార్యక్రమంలో నాగరాజు, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మహిళ హత్య కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ఓబుళదేవరచెరువు మండలంలోని కొండకమర్లలో వివాహిత హత్య కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్పీ వి.రత్న తెలిపారు. ఎస్పీ శనివారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఎస్పీ మాట్లాడుతూ కొండకమర్ల గ్రామానికి చెందిన మెహతాజ్‌తో ఇర్ఫాన్‌బాషాకు వివాహేతర సంబంధం ఉందన్నారు. అయితే ఆమె మరొకరితో చనువుగా ఉందని కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి 11 గంటలకు మెహతాజ్ ఇంటికి వెళ్లి ఆమెతో గొడవపడి గొంతు నులిమి చంపేశాడు. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టి ఇర్ఫాన్‌బాషాను శనివారం ఉదయం గాజుకుంటపల్లి వద్ద అరెస్టు చేశారు. వేగవంతంగా హత్యకేసును ఛేదించి నిందితుడిని అరెస్టు చేసిన నల్లమాడ సిఐ నరేందర్‌రెడ్డి, ఎస్ఐ మల్లికార్జున్‌రెడ్డిని ఎస్పీ అభినందించి నగదు రివార్డు అందజేశారు. హత్య కేసులో నిందితుడిని అరెస్టు చేయడానికి సహకరించిన పోలీస్ సిబ్బందిని ఆమె అభినందించారు. ఎస్పీతో పాటు ఎఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్, నల్లమడ సిఐ నరేందర్‌రెడ్డి, ఒడిసి ఎస్ఐ ఉన్నారు.

తండ్రి కనిపించలేదని ఫిర్యాదు

ప్రజాశక్తి-గాండ్లపెంట

మండల కేంద్రంలోని మునగలవారిపల్లికి చెందిన మునగల కేశవరెడ్డి(77) కనిపించకుండా పోయారని ఆయన కుమారుడు మునగల బాబుల్‌రెడ్డి శనివారం ఫిర్యాదు చేశాడని ఎఎస్ఐ రంగా తెలిపారు. కేశవరెడ్డి 15 రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయాడని, అప్పటి నుంచి బంధువులు ఇళ్లు, తదితర చోట్ల వెతికినా కనిపించ లేదని తెలిపారు. బాబుల్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ తెలిపారు.

తలమర్లలో ఘర్షణ

ప్రజాశక్తి-కొత్తచెరువు

మండలంలోని కొత్తచెరువు-తలమర్ల రహదారికి నిధులు మంజూరు కావడంతో పనులు ప్రారంభించడానికి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి గ్రామానికి వచ్చి పనులను ప్రారంభించారు. అనంతరం వారు తలమర్లకు వెళ్తుండగా తిప్పాబట్టపల్లి గ్రామానికి చెందిన రెండు వర్గాల నాయకులు తమ ఇంటికి రావాలంటే తమ ఇంటికి రావాలని పోటీ పడ్డారు. ఈ క్రమంలో ఇరు వర్గాల నాయకులు పరస్పర దాడులకు పాల్పడ్డారు. ఈ విషయం సిఐ ఇందిరకు తెలియడంతో గ్రామంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

సత్యసాయి జయంతి వేడుకల ఏర్పాట్లు వేగవంతం చేయండి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ఈఎస్ వెంకటేష్

శ్రీసత్యసాయి బాబా జయంతి వేడుకల ఏర్పాట్లను వేగవంతంగా పూర్తి చేయాలని సిపిఎం జిల్లా నాయకులు ఈఎస్.వెంకటేష్ శనివారం ఓ ప్రకటనలో కోరారు. సత్యసాయి 99వ జయంతి వేడుకలు ఈ నెల 23వ తేదీ నిర్వహిస్తున్న తరుణంలో ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల నుంచి పెద్దఎత్తున భక్తులు పుట్టపర్తికి వస్తారన్నారు. అయితే ఇప్పటివరకు పట్టణంలో ఏ మాత్రం ఏర్పాట్లు ప్రారంభం కాకపోవడంతో భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. ఏర్పాట్లు చేయడంలో పట్టణ, మున్సిపాలిటీ అధికారులకు ఏమాత్రం చిత్తశుద్ధి లేదనిపిస్తుందన్నారు. ఇప్పటి వరకూ చిత్రావతి నది పక్కన సుందరీకరణ పనులు, రోడ్ల క్లీనింగ్ పూర్తి చేయలేదన్నారు. గతంలో రెండు నెలలు ముందు నుంచే ఏర్పాట్లు చేసేవారన్నారు. ఈసారి ఇప్పటివరకు ఎలాంటి ఏర్పాట్లు ఎక్కడా చేపట్టలేదన్నారు. అలాగే పుట్టపర్తికి వచ్చే వివిధ మార్గాల్లో రోడ్లకు ఇరువైపులా కంప చెట్లను తొలగించాలన్నారు. భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా ఏర్పాట్లను త్వరితగతిన ప్రారంభించి పూర్తి చేయాలని, ఈ విషయంలో జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

రొద్దంలో ట్రాఫిక్ సమస్యలు

ప్రజాశక్తి-రొద్దం

రొద్దంలో ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

రొద్దంలో ట్రాఫిక్ సమస్య రోజు రోజుకూ తీవ్రం అవుతోంది. వారంలో మిగతా రోజులు ఎలా ఉన్నా శనివారం మాత్రం ట్రాఫిక్ సమస్య మరింత ఎక్కువగా ఉంటుందని ప్రజలు వాపోతున్నారు. ఈ క్రమంలో నూతన ఎస్ఐ నరేంద్ర వారం రోజుల క్రితం దుకాణదారులను స్టేషన్‌కు పిలిపించి ఎవరి దుకాణం ముందు వాహనం ఉంచితే వారే బాధ్యులవుతారని హెచ్చరించారు. అయినా ఎవరిలో మార్పు రాకపోవడంతో శనివారం కూడా తీవ్ర ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. ప్రధానంగా వైఎస్ఆర్ సర్కిల్ నుంచి మెయిన్ బజారు వరకూ అక్కడక్కడ మట్టి కుప్పలు, పాత లైబ్రరీ వద్ద విద్యుత్ స్తంభం రోడ్డుకు అనుకొని ఉంది. దీంతో ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఇకనైనా రోడ్డుపై ఉన్న మట్టి కుప్పలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ఆకతాయిలకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి-సోమందేపల్లి

స్థానిక ఓ పాఠశాల సమీపంలో విచ్చలవిడిగా తిరుగుతూ స్థానికులకు ఇబ్బందులు కల్పిస్తున్న 8 మంది ఆకతాయిలకు కౌన్సెలింగ్ ఇచ్చినట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ కొందరు ఆకతాయిలు అల్లరి చేష్టలకు పాల్పడుతూ పాఠశాల మైదానంలో, సమీప బజారులో తిరుగుతున్నారని గ్రామస్తులు ఫిర్యాదు చేశారన్నారు. దీంతో వారిని స్టేషన్‌కు పిలిపించి పెనుకొండ డీఎస్పీ సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. ఇకపై పాఠశాల సమీపంలో, ఎక్కడైనా అల్లరి చేష్టలకు పాల్పడితే కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో అవగాహన

ప్రజాశక్తి-గుడిబండ

మండలంలోని పలారం గ్రామంలో శనివారం కెనరా బ్యాంక్ మేనేజర్ మల్లయ్య ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సంఘాల్లో మహిళలు తీసుకున్న వివిధ రుణాలను బ్యాంకులు ఏ విధంగా రికవరీ చేయాలి, తీసుకున్న రుణాలను మహిళల ఎలా సద్వినియోగం చేసుకోవాలనే అంశాలపై వివరించారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ సాయి సిద్ధార్థ్, యానిమేటర్ నరసింహమూర్తి, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

అవినీతి నిర్మూలనపై వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-ముదిగుబ్బ

స్థానిక ఎస్‌డిఆర్ఆర్ జూనియర్ కళాశాలలో శనివారం ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో అవినీతి నిర్మూలనపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు బ్యాంక్ మేనేజర్ సాగర్ తెలిపారు. పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు చందు, స్రవంతి, కుసుమలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శివారెడ్డి, ప్రకాష్‌రెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మల్లికార్జున్‌రెడ్డి, బ్యాంక్ సిబ్బంది లక్ష్మీ, రామ్‌నాయక్ పాల్గొన్నారు.

పిహెచ్‌సి తనిఖీ

ప్రజాశక్తి-రొద్దం


పిహెచ్‌సి సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ నాగేంద్రనాయక్

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ బి.నాగేంద్ర నాయక్ సందర్శించి రికార్డులను పరిశీలించారు. అనంతరం గర్భిణుల రిజిస్టర్, ప్రమాద సూచికలు, తదితర అంశాలపై ఆరా తీశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. వ్యాక్సినేషన్ జరిగిన మోతాదులను యూవిన్ యాప్‌లో పొందుపరచాలని, వ్యాక్సినేషన్ జరిగే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆయన వెంట డాక్టర్ భాగ్యలక్ష్మి, డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం ఆఫీసర్ నాగరాజు, హెల్త్ ఎడ్యుకేటర్ ఎం.చంద్రనాయక్, హెల్త్ సూపర్వైజర్ గిరినాథ్‌రావు, ఫార్మసిస్ట్ చాంద్, ల్యాబ్ టెక్నీషియన్ శ్రవణ్ తదితరులు ఉన్నారు.